# జెన్ జీరో ఇంక్

## – నిర్మలాదిత్య



### నాంది

*(లక్ష్మి సైబర్ సెక్యూరిటీ రంగంలో పనిచేస్తూ, ప్రపంచంలోని ఆర్థిక నేరాలు, అవి చేస్తున్న ప్రముఖ రాజకీయ నాయకుల, వ్యాపార వేత్తల పేర్లు 'పనామా పేపర్స్' ద్వారా బయట పెట్టింది ("క్షీర సాగర మధనం" కౌముది జనవరి 2023 నుంచి జనవరి 2024 వరకు వచ్చిన సీరియల్ నవల).*

అటు తరువాత -

లక్ష్మి తండ్రి విశ్వం అనుకున్నట్లే, ఈ నేరాలు చేసిన వ్యక్తుల పేర్లు తెలిసిన తరువాత కూడా, ఎక్కడో ఒక ఐస్ లాండ్ ప్రధాని శిక్షించ బడడం తప్పితే, మిగిలిన వారందరూ బాగానే ఉన్నారు.

భారత దేశంలో ఉన్న పారిశ్రామిక వేత్త పి.ఎల్. (పనామా పేపర్లలో పేర్కొన బడిన నేరస్థుడు) ప్రభుత్వం సహాయం తో మరిన్ని పరిశ్రమలు నెలకొల్పి ప్రంపంచంలోని, బిల్ గేట్స్, ఎలన్ మస్క్ ల బిలియనీర్ల లిస్ట్ లో చేరి పోయాడు.

పి.ఎల్. కొడుకు అరసు(పనామా పేపర్లలో పేర్కొన బడిన నేరస్థుడు)తండ్రి అడుగుజాడల లో నడుస్తూనే ఉన్నాడు.

సిద్దార్థ్(పనామా పేపర్లలో పేర్కొన బడిన నేరస్థుడు) పి.ఎల్ ఆర్థిక పెట్టు బడితో, తన కల్ట్ సినీ ఫ్యాన్స్ అండదండలతో భారత ప్రధాని పదవికి అతి చెరువులో ఉన్నాడు.

వినోద్ ప్రభుత్వ రంగంలో పని చేస్తూ, పి.ఎల్. లాంటి నేరస్తులను కెరీర్ మొత్తం పట్టుకోవాలని ప్రయత్నించి, విఫలమై రిటైర్ అయ్యి పోయాడు.

పి. ఎల్. స్నేహితుడు పీర్ క్యాన్సర్ తో చనిపోయాడు.

పీర్ కొడుకు డాక్టర్ సలీం తండ్రి క్యాన్సర్ కు కారణం పి.ఎల్ కంపెనీలు చేసిన కాలుష్యం అని తెలిసినా, పి. ఎల్. కట్టిన కొత్త పెద్ద హాస్పిటల్ కు డైరెక్టర్ కావడంతో, హామ్లెట్ మనస్తత్వం తో పని చేస్తూనే ఉన్నాడు.

పీర్ కూతురు ఆయషా, అరసు తో కలసి చదువుతున్నప్పుడు ప్రేమలో పడి, మనస్పర్థల వల్ల బ్రేక్ అప్ అయ్యి, ఆ అనుభవం నుండి కోలుకొని లక్ష్మి కంపెనీకి పని చేస్తున్నది. అరసు ఎప్పుడో ఒక సారి మనసు మార్చుకొని తిరిగి అమెరికాకి తన దగ్గర వస్తాడని ఆశ. అది ఒక గొంతెమ్మ కోరిక అని తనకి తెలుసు.

లక్ష్మి మియామీ నుండి తన కంపెనీ టాంప బే లోని వెస్లీ ఛాపెల్ అనే సబర్బ్ కు మారింది. ఫ్లోరిడా రాష్ట్రంలో పూర్తిగా దక్షిణంలో ఉన్న మియామీ కంటే రాష్ట్రం మధ్యలో ఉన్న టంపా బే తన బిజినెస్ కు మంచిదని పించింది. తూర్పున ఓర్లాండో ఒక గంట ప్రయాణం, ఉత్తరం గెయిన్స్ విల్, రాష్ట్ర రాజధాని టాళ్ళహస్సీ, జాక్సన్ విల్, దక్షిణాన నేపుల్స్, మియామీ అన్నీ కారులో కొన్ని గంటల ప్రయాణాలే. పొద్దున్న పోయి పని చూసుకొని సాయంత్రానికి వచ్చేయ వచ్చు.

అలానే తండ్రి నివసిస్తున్న టార్పాన్ స్ప్రింగ్స్, బీచ్ టౌన్ లు క్లియర్ వాటర్, సెయింట్ పీటర్స్ బర్గ్, సరసోట అన్నీ లక్ష్మి ఉంటున్న వెస్లీ ఛాపెల్ కు ఒక గంట లోపు దూరంలోనే ఉన్నాయి. ఇవన్నీ టాంప బే సబర్బ్ లు.

లక్ష్మి తను టాంప బే మారడంతో కొత్త కంపెనీ జెన్ జీరో ఇంక్ పెట్టింది. ఆయషా, లక్ష్మి లకు కొత్త పనులు, ప్రాజెక్టులు వస్తూనే ఉన్నాయి. చేసిన ప్రతీ పని గొప్పగా చేయడం వల్ల కంపెనీకి పేరు రావడంతో బాటు మరింత ఛాలెంజింగ్ పనులు వస్తున్నాయి.

జెన్ జీరో ఇంక్ పనిచేసే ప్రాజెక్ట్ లు సామాన్యులకు అంతుబట్టని రహస్య ప్రపంచంలోనే ... )

# 'ఆటలో అరటిపండు'

# (మొదలు)

**" గూటన్ బర్గ్ పేరు విన్నావా?" అడిగింది లక్ష్మి.**

" ప్రింటింగ్ ప్రెస్ గుర్తుకు వస్తుంది," అంది ఆయషా.

"ఇంకా?"

"మొదటి పుస్తక ప్రచురణ – గూటన్ బర్గ్ బైబిలు.'

"మరీ క్విజ్ పోటీలో పాల్గొన్నట్లు జవాబులిస్తున్నావు. ప్రస్తుతానికి రా. మొన్న టెక్సాస్ లో బయట పడిన ఫ్రాడ్ గురించి వినే ఉంటావు. భారత దేశంలో నుంచి వచ్చి ఇక్కడ స్థిర పడిన వారినే టార్గెట్ చేస్తూ, పెట్టుబడి రెట్టింపు చేస్తామని, కొన్ని మిలియన్ల ఫ్రాడ్ మన వారే చేసారు."

"ఆ ఫ్రాడ్ గురించి విన్నాను. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ కమిషన్ అదే ఎస్ ఈ సి ఆ మోసం చేసిన కంపెనీ, దాని నెలకొల్పిన మన వారి మీద నేరం మోపిందని తెలుసు. ఆ కేసు ఇంకా నడుస్తున్నదని విన్నాను."

" ఆ నేరం వివరాలు ఎస్ ఈ సి కి అందచేసినది ఎవరను కున్నావు? గూటన్ బర్గ్ రిసెర్చ్."

"రిసెర్చ్ కంపెని అంటున్నావు. ప్రత్యేకంగా ఈ టెక్సాస్ కంపెనీని ఎలా, ఎందుకు ఎన్నుకున్నారు?"

"ఏ కంపెనీలో నైనా అకౌంటింగ్ పరంగా అవక తవకాలు ఉంటే, లేక మేనేజ్మెంట్ వాళ్ళు ఏదైనా ఫ్రాడ్ పనులు చేస్తుంటే ఆ కంపెనీల మీద సరైన ఆధారాలు సేకరించి గూటన్ బర్గ్, ఎస్ ఈ సి కి, ప్రెస్ కి కూడా అంద చేస్తారు."

"దాని వల్ల గూటన్ బర్గ్ కు లాభం ఏమిటి? రిసెర్చ్ చేయాలంటే ఆదాయం ఉండాలి కదా? వాళ్ళ బిజినెస్ మోడల్ ఎంటి?"

"గూటన్ బర్గ్ ఒక ప్రైవేట్ ఇన్వెస్ట్మెంట్ కంపెని. వాళ్ళు ఇలాంటి తప్పుడు పనులు చేస్తున్న కంపెనీ లను టార్గెట్ చేసి, ఆ కంపెనీ స్టాక్ విలువ పడిపోతుందని స్టాక్ మార్కెట్ లో వ్యాపారాలు చేస్తారు. వాళ్ళ రిపోర్ట్ వచ్చిన వెంటనే, స్టాక్ మార్కెట్ లో వాళ్ళు టార్గెట్ చేసిన కంపెనీ షేర్ల విలువ ఘోరంగా పడిపోతుంది. గూటన్ బర్గ్ కంపెనీ అప్పటికే అలా పడిపోతుందని సరిగ్గా అంచనా చేసి, ఆ స్టాక్స్ షార్ట్ చేయడం వల్ల మంచి లాభాలు చేసుకుంటుంది."

"ఎస్ ఈ సి ఇలా చేయడం సరి కాదని గూటన్ బర్గ్ కంపెనీకి చెప్పదా?"

"గూటన్ బర్గ్ కంపెని తమ రిసెర్చ్, దాని వల్ల తాము స్టాక్ మార్కెట్ లో షేర్ల విలువ పడిపోతాయి అని తీసుకున్న షార్ట్ పొజిషన్ డాలర్ విలువ ఎస్ ఈ సి ముందే తెలపడం వల్ల అది నేరం కాదు. "

"అంటే ఎస్ ఈ సి కి చేదోడుగా పనిచేస్తున్నట్లు ఉంది. కానీ ఎందుకు ఈ కంపెనీ గురించి అడిగావు?"

"ఆ కంపెనీ నుంచి మనకొక ప్రోజెక్ట్ వచ్చింది. నెలలో మనం పరిశోధన చేసి వారికి రిపోర్ట్ అందజేయాలి. మరో ప్రశ్న. బాదామి గ్రూప్ కంపెనీల గురించి విన్నావా?'

"ఆ విన్నాను. అరసు వాళ్ళ పి.ఎల్. గ్రూప్ కు ప్రత్యర్థి. గత పదేళ్ళలో నే వాళ్ళు ఓడ రేవులు విమానాశ్రయాలు, రోడ్లు, ఎనర్జీ అంటూ చాలా ప్రాజెక్టులు ప్రపంచంలో పలు దేశాలలో పూర్తి చేసారు. బిలియన్ ల కొద్ది డాలర్ లు సంపాదించేసారు."

"పదేళ్ల లోనే, వేల రూపాయల నుండి వ్యాపారం బిలియన్ ల డాలర్లకు ఎదగడం ఆశ్చర్యమని పించలేదు?"

"ఆ ఎదుగుదలకు ప్రభుత్వ సహాయం కూడా ఉందన్న వదంతి ఉంది. ప్రస్తుతం ప్రభుత్వంలో ఉన్న రాజకీయ పార్టీకి ఈ కంపెనీ కోశాధికారి అని కూడా కొంత వెటకారం చేసే వాళ్ళున్నారు. బాదామి కంపెనీలు నెలకొల్పిన మాధవ్ కులకర్ణి కి భారత దేశంలో అడ్డులేదు. దేశ ప్రధాని నుంచి అధికార పార్టీ లో ఉన్న పెద్ద రాజకీయ నాయకులందరూ, మాధవ్ కు సన్నిహితులే."

"బాదామి కంపెనీల పైన పరిశోధన చేయాలి. కొత్త కాంట్రాక్ట్ వచ్చింది."

"ఎవరి కోసం? గూటన్ బర్గ్ కంపెనీ కోసమా? బాదామి గ్రూప్ లో చాల కంపెనీలు ఉన్నాయి. ఏ కంపెనీ మీద రిసెర్చ్ చేయాలి?"

"మొత్తం గ్రూప్ మీద. మనమే అన్ని విషయాలు సేకరించాలి. స్టార్ట్ ఫ్రమ్ ది స్క్రాచ్."

"బాదామి గ్రూప్ మీద రిసెర్చ్ ఎందుకు?"

"గూటన్ బర్గ్ ఎవరికి అనుమానం రాని కంపెనీల పైననే రీసెర్చ్ చేస్తాయి. అలా చేయడం వల్ల, రిపోర్ట్ బయటకి వచ్చినప్పుడు స్టాక్ మార్కెట్ లో ఆ టార్గెట్ కంపెనీ స్టాక్ విలువలకి తగిలే దెబ్బ, గూటన్ బర్గ్ కంపెనీకి అధిక లాభాలు కలుగ చేస్తాయి. ఆ టార్గెట్ కంపెనీ స్టాక్ విలువలు ఘోరంగా పడిపోతాయి. అదే గూటన్ బర్గ్ కు కావలసినది కూడా."

"అసలు గూటన్ బర్గ్ కు బాదామి కంపెనీ మీద అనుమానం ఎలా వచ్చింది?"

"నువ్వు ఇదివరకు బాదామి గ్రూప్ మీద చెప్పిన వివరాలలోనే ఉంది సమాధానం. ఆ కంపెనీ పదేళ్ల లోనే ప్రపంచ అగ్రశ్రేణి కంపెనీ జాబితాలో చేరింది. ఆ కంపెనీ నెలకొల్పిన మాధవ్ కు ప్రభుత్వం కు ఉన్న ప్రత్యేక అనుబంధం, దానికి ఒక ముఖ్య కారణం."

"ఇక్కడి నుంచే కావలసిన వివరాలు సేకరించడానికి ప్రయత్నిస్తాను. ఇండియా, ఆఫ్షోర్ బ్యాంకింగ్ ఉండే దేశాలు కూడా తిరగాల్సివస్తుందను కుంటాను."

"ట్రావెల్ చేయడానికి అనుమతి కూడా కాంట్రాక్ట్ లోనే తీసేసు కొన్నాను. ఇండియాకు ట్రిప్ తప్పని సరి అని వారికి తెలుసు. వేరే దేశాలు తిరగాల్సిన అవసరం వస్తే, గూటన్ బర్గ్ కంపెనీ కి తెలిపితే చాలు. అన్నట్టు ఇండియాకి పోతే, మీ కుటుంబంతో పాటు అరసు ను కూడా కలవచ్చు."

"అరసు వాళ్ళ నాన్న పి.ఎల్. నుంచి మరిన్ని బాధ్యతలు తీసుకుంటున్నాడట. ఇటీ వలే, వాళ్ళ గ్రూప్ కు సీ ఈ ఓ గా కూడా ప్రకటించారు. ఆ సందర్భంగా ఒక పెద్ద పార్టీ పెట్టారు. అరసు నన్ను కూడా రమ్మని, ఫోన్ చేశాడు."

"మరి నువ్వు ఆ పార్టీ కి పోతున్నావా? తన కున్న పని ఒత్తిడిలలో కూడా తనే నీకు పర్సనల్ గా ఫోన్ చేసి పిలిచాడంటే, నువ్వంటే ఇష్ట పడుతున్నాడు అనుకుంటాను. ఎన్రికో తో బ్రేక్ అప్ అయ్యావు. అరసు కూడా ఆ సినిమా అమ్మాయిని వదిలేసి వంటరిగానే ఉన్నాడని, నువ్వే చెప్పావు. ఈ సారి పని మీద ఇండియా పోతున్నప్పుడు, అలానే అరసు ను కూడా కలువు. ఎవరికి తెలుసు, మీరు మళ్ళీ దగ్గర అవ్వుతారేమో? మీ ఇద్దరూ ఒకరికి ఒకరు చిన్నప్పటి నుంచి తెలుసు కదా."

“అరసు పార్టీ కి పోవాలని ఇంత వరకు అనుకోలేదు. కానీ, ఈ గూటన్ బర్గ్ ప్రోజెక్ట్ మీద ఇండియాకి పోవాల్సి వచ్చి ఆ సమయంలోనే అరసు పార్టీ ఉంటే, పోవడానికి ప్రయత్నిస్తాను.”

లక్ష్మి కి ఆయషా పని మీద నమ్మకం ఉన్నందు వల్ల, గూటన్ బర్గ్ ప్రోజెక్ట్ మీద అంతకంటే వివరాలు, పని ఎలా చేయాలన్న సలహాలు కానీ దొరకవని తెలుసు. ఆయషా కు ఎక్కడ నుండి మొదలు పెట్టాలో వెంటనే అంతు బట్టలేదు. ఆ పని తరువాత మొదలు బెట్టుదామని, పక్కకు పెట్టి, తాను అది వరకు చేస్తున్న పని రిపోర్ట్ వ్రాయడం మొదలు పెట్టింది. ఒక ప్రోజెక్ట్ తరువాత మరొకటి వేచిఉండడం ఆయషకు బాగానే ఉంది. జెన్ జీరో ఇంక్ ప్రగతికి అది అవసరం కూడా.

ఆ రోజు రాత్రి ఆయషాకు సరిగా నిద్ర పట్టలేదు. కొంత సేపు పొర్లిన తరువాత అలారమ్ లోటైం చూసింది. పొద్దున్న మూడు గంటలు. లేచి నీళ్ళు త్రాగి అపార్ట్మెంట్ బయట చూసింది. పొద్దునంతా జనంతో కళ కళ లాడే వీధులు బోసి పోయి ఉన్నాయి. దూరంగా ఉన్న సరస్సు నీళ్ళ పైన చంద్రుడు కనిపిస్తున్నాడు. పౌర్ణమి పోయి రెండు మూడు రోజులై ఉండాలి. వీధి దీపాలతో పోటీ పడుతూ వెన్నెల కాస్తూ ఉంది. కిటికీ ఎదురుగా వేసుకున్న టేబిల్ దగ్గర కూర్చుంది ఆయషా. అక్కడే తను పని చేయాలనుకుంటే కూర్చుండేది. పనిలో విరామం కావాలంటే తలెత్తి చూస్తే, కిటికీలోనుంచి కనిపించే దృశ్యాలు మనస్సుకు కొంచెం తెరపి నిస్తాయి. అప్పుడప్పుడు కిటికీ గట్టు మీద కూర్చుని కాఫీ త్రాగుతూ గడిపిన క్షణాలు ఉన్నాయి. అది తనకి ఊరట కలిగించే ప్రదేశం.

ముందు చేస్తున్న ప్రోజెక్ట్ రిపోర్ట్ ఆ రోజే పూర్తి చేసేసింది ఆయషా. ఇక గూటన్ బర్గ్ ప్రోజెక్ట్ మొదలెట్టాలి. ఆయషా టేబిల్ రెండో అరలో నుంచి రకరకాల పూసలు, పూసలు కట్టడానికి దారాలు, వైర్ లు, కావలసిన పని ముట్లు తీసి టేబిల్ పైన పెట్టింది. తన మనస్సులోని అలజడి అదుపులో పెట్టడానికి ఈ కొత్త హాబీ మొదలెట్టింది ఆయషా. ఇది వరకు చెడిపోయిన మిక్సి, కెమెరా లాంటి వస్తువులు అన్నీ పార్టులు విడదీసి, వీలైతే రిపేర్ చేసేది. ఈ మధ్య అన్నీ బాగానే పని చేస్తున్నాయి. అందుకే, రిపేర్ లు మానేసి, కొత్త వస్తువులు చేసుకోగల ఈ హాబీ అలవరచుకుంది, ఆయషా.

కమ్మలు, మెడలోని పూసల దండ అయ్యి పోయాయి. ఇక మిగిలినది దండ కు తగ్గ పెండెంట్ తయారు చేయడమే. మనిషి మెదడు ఎప్పుడూ సిమ్మెట్రీ ని కోరుతుంది. అందుకే ముఖంలో కుడివైపు, ఎడమవైపు అచ్చుగుద్ది నట్లు ఉండేవారు ఆకర్షణీయంగా, అందంగా కనపడతారు. దండలో సిమ్మెట్రీ ఉందని మరో సారి చెక్ చేసుకుంది..

ఆయషా కు ఇలా ఏదో ఒక పనిలో ఇమిడిపోవడం మనస్సులోని అలజడిని అణిచి వేయడమే కాక, కొత్త కొత్త ఐడియా లు ఎక్కడినుంచో తళుక్కుమని వచ్చేస్తుంటాయి. కొన్ని సార్లు అవి అంతుబట్టని సమస్యలకు పరిష్కారాలు కూడా. అలాగే, పెండెంట్ మీద పని చేస్తుంటే, పనామా పేపర్ల మీద లక్ష్మి, తను చేసిన పరిశోధన గుర్తుకు వచ్చింది. బహుశా అందులో బయట పడిన కంపెనీల కు పరిశోధన చేయ వలసిన బాదామి కంపెనీలకు సంబంధం కనుక్కో గలిగితే, తీగ మొదలు చిక్కి నట్లే. దాన్ని లాగి బాదామి కంపెనీల డొంకంతా లాగొచ్చు. వెంటనే, అందుబాటులో ఉన్న ఫోన్ తీసుకొని,

తనకొచ్చిన ఆలోచనలు రెండు మూడు పదాలలో వ్రాసి వాట్స్ ఆప్ లో తనకు తానే మెసేజ్ చేసుకుంది. తరువాత నిద్ర వచ్చేయడం తో బెడ్ మీద వాలి పోయి, అలారమ్ మ్రోగ గానే లేచింది ఆయషా.

రాత్రి సరిగా నిద్ర పట్టకపోవడం తో అలసటగా నే ఉంది. కానీ రాత్రి బాదామి ఎంటర్ప్రైసెస్ మీద పని మొదలు బెట్టడానికి ఏదో ఆలోచన వచ్చిందని తెలుసు. గుర్తుకు రాకపోవడం తో ఫోన్ చెక్ చేసింది. అందులో తను రాత్రి తనకు తానే రాసుకున్న మెసేజ్ చూసింది. వెంటనే తను ఆ రోజు చేయవలసిన పని అర్థం అయ్యి అంత వరకు లేని ఉత్సాహం వచ్చేసింది. అందుకే లక్ష్మి తో కలిసి ఈ కేసుల మీద పని చేయడం ఆయషా కు సంతోషంగా, తృప్తి గా ఉంది. పని చేయాలని ఉత్సాహ పడే ఉద్యోగాలు దొరకడం అదృష్టమే. అతి కొద్ది మందికే దొరుకుతుంది.

ఆయషా వెస్లీ చేపెల్ లో ఉన్న ఆఫీస్ కు కార్లో పోతూ అన్న సలీం కు ఫోన్ చేసింది.

“ఎంటి ఆయషా? ఎలా ఉన్నావు?”

“బాగానే ఉన్నాను అన్న. పొద్దున్నే లేపానేమో కదా? ఇప్పుడయితేనే నాకు టైం సరిపోతుంది.”

“నువ్వెప్పుడు ఫోన్ చేసినా నాకు పరవాలేదు. ఇప్పుడు డ్రైవ్ చేస్తున్నావేమో కదా జాగ్రత్త,” అన్నాడు సలీం. తండ్రి పీర్ పోయిన తరువాత ఆయషా పట్ల ఇష్టానికి, బాధ్యత తోడయ్యింది. అందుకే ఆయషా ఎమ్మన్నా సలీం అనూనయంగానే మాట్లాడుతాడు. ఎప్పుడు ఆయషా ఫోన్ చేసినా, వెంటనే ఎత్తుతాడు.

“జాగ్రత్తగానే చేస్తున్నాను. కార్ ఫోన్ లో మాట్లాడు తున్నాను. నా రెండు చేతులు స్టీరింగ్ మీదనే ఉన్నాయి, కంగారు పడద్దు.”

“అన్నట్లు అరసు మొన్నీమధ్య ఫోన్ చేశాడు. తను పి ఎల్ కంపెనీలన్నిటి బాధ్యత తీసుకుంటున్నాడని చెప్పాడు. అరసు తండ్రి చైర్మన్ గా కొనసాగుతున్నా, దాదాపు రిటైర్ అయ్యినట్లే. ఆ సందర్భంగా ఒక పెద్ద పార్టీ కంపెనీల తరఫున పెడుతూ నన్ను పిలిచాడు. నిన్ను కూడా పిలిచాడటగా? వస్తున్నావా?”

“అవును, నన్నూ పిలిచాడు. అరసు ఫంక్షన్ కి నేనెందుకు వస్తానను కుంటావు?”

“పోనీ అమ్మను, నన్ను చూడడానికి రా. అయినా అరసు కి నువ్వంటే ఇంకా ఇష్టం లేకపోతే నీకు ఫోన్ చేసి ఎందుకు పిలుస్తాడు? అతనెంత బిజీ గా ఉంటాడో నాకు తెలుసు. తను నాకు చిన్న నాటి స్నేహితుడైన, నీ వల్లే నాకు కూడా ఫోన్ చేసి మాట్లాడాడని పిస్తుంది.”

“నాకు వాళ్ల కంపెనీలు చేస్తున్న మోసాలు ఇష్టం లేదు. అరసు తో ఉండటం కూడా ఇష్టం లేదు. నువ్వు కాబట్టి వాళ్ళు స్థాపించిన హాస్పిటల్ లో అన్నీ తెలిసి పని చేస్తున్నావు.”

“గత కొన్ని సంవత్సరాల గా మార్పులు వచ్చాయి ఆయషా. నువ్వు దూరంగా ఉన్నందు వల్ల నీకు తెలిసినట్లు లేదు. ఇప్పుడు పి ఎల్ గ్రూపు కంపెనీలు దేశంలో నే అగ్రశ్రేణి లో ఉన్నది. రాజకీయాలలో చేరి దేశాన్ని ఏలుతున్న సినీ నటుడు

సిద్దార్థ్ కూడా పి ఎల్ మనిషినే. దానికి తగ్గట్టు అరసు కూడా బిజినెస్ ప్రొఫెషనల్ గా నడపాలని ఉద్దేశ్యం ఉన్న వాడు. కాబట్టి పి ఎల్ గ్రూప్ మీద నీకటు వంటి అభిప్రాయాలు ఇంకా పెట్టుకోవడం సరి కాదేమో. అలానే అరసు పట్ల కూడా."

"నాకు మటుకు మారడానికి కారణాలు ఏమీ దొరకలేదు."

"అలా మొండి కేస్తావు ఎందుకు? నువ్వు పి ఎల్ గ్రూప్ కంపెనీలు పని చేస్తున్న తీరు చూడు. ఇప్పుడు ఈ కంపెనీలకు అడ్డ దారులు తొక్కాల్సిన పని లేదు. మా హాస్పిటల్ సంగతి నే చూడు. ఇప్పుడు దేశంలోనే పెద్ద హాస్పిటల్ నాది. ఇక్కడ పనిచేసినంత మంది ఎక్సపెర్ట్స్ మరే హాస్పిటల్ లో లేరు. అలానే మా హాస్పిటల్ కి ఉన్న పరికరాలు, వసతులు ఈ దేశంలో మరెక్కడా లేదు. ఆసియా లోని అనేక దేశాల నుండి రోగులు మా హాస్పిటల్ కు వస్తున్నారు. నువ్వున్న దేశంలో ని హాస్పిటల్ కు ఏ మాత్రం తీసిపోదు."

"నీ కన్నీ విషయాలు తెలియవు సలీం."

అన్న బదులు సలీం అని పిలిచిందంటే ఆయషకు కోపం వచ్చిందని తెలిసిపోయింది సలీం కు.

"కోపం తెచ్చుకోవద్దు చెల్లి. నేను చెప్పేది లోకంలో సహజంగా జరిగేదే. ఒక లెవెల్ తరువాత గౌరవం తనంతట తనే వచ్చేస్తుంది. ఆ గౌరవం కాపాడు కోవడానికి నడకలో కూడా దానికి సరి పడ్డ మార్పులు వస్తాయి. మనుష్యులైనా, కంపెనీలైనా అదే జరుగుతుంది. టూ బిగ్ టు ఫెయిల్ అని వినే ఉంటావు. అలానే టూ బిగ్ టు రిస్క్ థెర్నేం. నాకు తెలిసినంత వరకు పి.ఎల్ గ్రూప్ కు అడ్డ దారులు తొక్కాల్సిన పని లేదు. పోనీలే అరసు కోసం కాక పోయినా, అమ్మను చూడడానికి రా."

"సరే ఆలోచిస్తాలే. నా ఆఫీస్ వచ్చేసింది. అమ్మను అడిగా నని చెప్పు," ఆయషా కాల్ కట్ చేసింది. అమ్మతో మాట్లాడితే పెళ్లి గొడవే. మూడ్ బావున్నప్పుడు తరువాత మాట్లాడు దాములే అనుకుంది ఆయషా.

ఆఫీస్ చేరే సరికి లక్ష్మి, కొత్తగా కాలేజీ నుంచి చేరిన ఇంటెర్న్స్ రిక్, షెల్లీ అప్పటికే పనిలో ఉన్నారు. ఆయషా అందరిని పలుకరించి తన టేబిల్ దగ్గర కూర్చుంది. ముందు ఇంటర్న్ లను పిలిచి వారు అంత వరకు చేసిన పని, చేయ వలసిన పని గురించి మాట్లాడింది.

తరువాత, లక్ష్మి తనకు ఇచ్చిన కొత్త గూటన్ బర్గ్ ప్రోజెక్ట్ ఎలా మొదలు బెట్టాలి అని ఒక అవగాహన ఆయషా కి రావడం వల్ల, వెంటనే కంప్యూటర్ లో పనామా పేపర్స్ గురించిన వివరాలు ఉన్న ఫోల్డర్ కి వెళ్ళింది.

మొదట ఇదివరకటి రిసెర్చ్ వల్ల, వ్యక్తుల పేర్లు, కంపెనీ పేర్లు బయట పడ్డ రికార్డు లన్నీ వదిలేసింది. గూటన్ బర్గ్ రిసెర్చ్ చేయమన్న బాదామి గ్రూప్ కంపెనీలు ఇది వరకు బయట పడ లేదు కాబట్టి, ఇంత వరకు పనామా పేపర్లలో అంతుబట్టని రికార్డ్స్ నే పరిశీలించాలి.

అలా ఇంతవరకు ఎలాంటి ఆచూకీ దొరకని రికార్డు లు కూడా వేల సంఖ్యలలో ఉన్నాయి. అందులో చాల కంపెనీల షేర్ల వివరాలు ఉన్నాయి. ప్రస్తుతం వివరాలు చూచాయగా ఉన్న, కొంత కష్ట పడితే ఆ షెల్ కంపెనీ నెలకొల్పిన వారి వివరాలు పట్టి వేయొచ్చు. అందులో దాదాపు ఒక వంద కంపెనీల వివరాలు ఇంత వరకు, ఎవరికి అంతుబట్టలేదు. వాటిని పరిశీలించింది. ఆ పని చేసే సరికి సాయంత్రం మూడు గంటలు అయ్యింది. అంత పని మధ్యలో కూడా, ఆ రూం లో కూర్చున్న లక్ష్మి, ఆయషా, రిక్, షెల్లీ అప్పుడప్పుడు ఆఫీసు విషయాలు, వ్యక్తిగత విషయాలు రేకెత్తి, రోటీన్ గా కొనసాగే పనిని కొంత ఆసక్తిదాయకంగా మలుచు కుంటున్నారు.

లక్ష్మి ఆయషా ను పలుకరించింది.

"ఏమైనా అంతుబట్టిందా?"

"హా లక్ష్మి. ఎలా ముందుకు పోవాలో తెలుసు," అంటూ ఆయషా అంత వరకు తను చేసిన పని వివరాలు లక్ష్మితో పంచుకుంది.

"తొంభై శాతం పని ఇప్పటికే పూర్తి చేసినట్టున్నావు. ఇంత వరకు వీటికి బాదామి కంపెనీలకు సంబంధమే లేదని నిరూపించ గలిగావు. ఇక మిగిలిన పది శాతం లోనే బాదామి కంపెనీలతో ముడిపడిన షెల్ కంపెనీలు కూడా ఉండి ఉండాలి," అంది లక్ష్మి.

"అక్కడి కే వస్తున్నాను. ఇక మిగిలిపోయిన కంపెనీలు ఒక వంద పై చిలుకే ఉండాలి. వాటి వివరాలు చూస్తే ఏమీ దొరకటం లేదు. ఇదిగో లిస్ట్, నీకు పంపిస్తాను"

లక్ష్మి కొన్ని నిమిషాలు ఆయషా పంపించిన లిస్ట్ చూసింది.

"నువ్వు పంపిన కంపెనీ వివరాలు చూసాను. షేర్ లు కరెన్సీ నోట్లు లాగా, ఎవరి దగ్గర ఉంటే వారి ది కంపెనీ అన్న ప్రతి పాదనతో నెల కొల్పిన కంపెనీలు ఇవి. మనలాంటి వారు ఎలాంటి ప్రయత్నం చేసిన ఆ కంపెనీ ఓనర్ దొరక కూడదన్న ఆలోచనతో నెలకొల్పిన కంపెనీలు."

"వంద చిల్లర కంపెనీలే కదా. ఈ రోజే, సగం పైన కంపెనీలు చూసేశాను. కొన్ని క్లూ లు దొరికాయి. మిగిలినవి రేపు చెక్ చేసి ముగించేస్తాను. అన్నట్టు బాదామి గ్రూప్ లో ఉన్న కంపెనీల బ్యాలెన్స్ షీట్ లు విశ్లేషణ చేయమని మన ఇంటెర్న్ లకు చెప్పాను. వారు కూడా ఆ పని రేపటికి ముగించేయాలి. ఇప్పటి వరకు అందిన సమాచారం బట్టి బాదామి కంపెనీలలో అవకతవకలు ఉన్నాయి. బాదామి కంపెనీలలో ఇన్వెస్ట్ చేసిన కొన్ని కంపెనీల బోర్డ్ లలో మాధవ్ కులకర్ణి అన్న కేశవ్ చాలా సార్లు కనిపించాడు. కానీ కేశవ్ నడుపుతున్న చాలా కంపెనీలు షెల్ కంపెనీలే. ఆ కంపెనీల వివరాలు పూర్తిగా తెలియటం లేదు. ఈ కంపెనీలు ఎక్కువగా మారిషస్, దుబాయ్, లండన్ లలో వ్యాపారాలు చేయడమో, అక్కడ ఆస్తులు ఉండడమో లేక అక్కడే ఈ కంపెనీలు నెలకొల్పినట్లో తెలుస్తున్నది."

“నీవు పనామా పేపర్ల నుంచి మొదలెట్టడం, రిక్కీ , షెల్లీ లు అటు పక్క ఇండియాలోని బాదామి గ్రూప్ కంపెనీల బ్యాలెన్స్ షీట్ నుండి మొదలెట్టడం మంచి స్ట్రాటజీ. ఇంకేమైనా తెలుస్తే రేపు చెప్పు,” మెప్పుకోలు గా చూసింది లక్ష్మి.

“ఇదే వివరాలతో మరి కొన్ని కంపెనీలు బయట పడతాయేమో. బాదామి కంపెనీల విశ్లేషణ బట్టి, దుబాయ్, లండన్, మారిషస్ లో పెట్టుబడి ఉన్న కంపెనీలు నా లిస్ట్ లో ఉన్నాయేమో అని చూసాను. ఒక పది దాక కంపెనీలు తేలాయి. వాటన్నిటికీ శాన్ ఎమ్. నేథన్ సంతకం చేశాడు. ఆ శాన్ కోసం వెదికాను. దొరక లేదు. రేపు కూడా నా పని కొనసాగిస్తాను.”

“సరే ఆయషా. నీ మాటలు వింటుంటే నువ్వు ఇండియాకు పోవాల్సిన పరిస్థితే వచ్చేటట్లుంది. ఎలానూ పోతున్నావు గా, అరసు తో మరో సారి కలవడానికి ప్రయత్నించ వచ్చు కదా. ముసుగులో గుద్దులాటలెందుకు? తాడో, పేడో తేల్చేయి,” అంది లక్ష్మి నవ్వుతూ.

“అదంతా సులభం కాదులే లక్ష్మి. ఇండియాకి అయితే నువ్వన్నట్లు పోవాల్సిందే. అరసు విషయం మాత్రం, నాకు ఇంకా కొంత సమయం కావాలేమో. ”

మరుసటి రోజు తరువాత తన ఆలోచనలు ఒక కొలిక్కి వచ్చాయి.

- పనామా పేపర్స్ లో బయట పడ్డ బేరర్ షేర్ సర్టిఫికెట్ లు ఉన్న కంపెనీలలో ఒక పదమూడు కంపెనీలకు

బాదామి గ్రూప్ కంపెనీలకు సంబంధం ఉండవచ్చు

- ఈ కంపెనీలకు లండన్, మారిషస్, దుబాయ్, సింగపూర్ లలో పెట్టుబడులు ఉన్నాయి. కొన్నిటికి అతి ఖరీదైన రియల్ ఎస్టేట్ లో.
- ఈ కంపెనీల కన్నిటికి ప్రతినిధి గా శాన్ ఎమ్. నేథన్ సంతకం పెట్టాడు
- శాన్ ఎవరన్నది తెలియలేదు. ఆ పేరుండి, ఇంత ఎత్తున్న వ్యాపార లావ దేవీలు చేస్తున్న మనుష్యు లెవరు కనపడలేదు.
- ఇక ఇండియా తరపున బాదామి కంపెనీల బ్యాలెన్స్ షీట్ లు పరిశీలించిన రిక్, షెల్లీ ల ప్రకారం, ఈ కంపెనీలలో ఊరు, పేరు తెలియని షెల్ కంపెనీ లు పెద్ద ఎత్తున డబ్బులు పెట్టుబడి పెట్టాయని తెలుసు.
- అక్రమార్జన లకు మేలి ముసుగు వేసి పెట్టుబడి పేరు మీద తెచ్చిన డబ్బు లని తేట తెల్లగా తెలుస్తున్నా, దానికి తగిన ఆధారాలు లేవు.
- ఇలా షెల్ కంపెనీలు పెట్టుబడి పెట్టిన బాదామి కంపెనీలకు ప్రతినిధి కేశవ్ కులకర్ణి.

- కేశవ్ కులకర్ణి బాదామి గ్రూప్ అధినేత మాధవ్ కులకర్ణి అన్న

ఇక తేలని విషయం,

- ఆయషా ద్వార పనామా పేపర్లలో బయట పడ్డ శాన్ నేథన్ ఆఫ్ షోర్ కంపెనీలకు, రిక్, షెల్లీ ల రిసెర్చ్ ద్వారా బయట పడ్డ బాదామి గ్రూప్ కేశవ్ కులకర్ణి కంపెనీలకు సంబంధం ఉందా లేదా అన్న విషయం.

అది తేలనంత వరకు గూటన్ బర్గ్ రిసెర్చ్ కు పంపవలసిన రిపోర్ట్ పూర్తి కాదు.

మరుసటి రోజు ఆయషా లక్ష్మిని కలిసింది.

"లక్ష్మి, ఇండియాకు పోవాల్సిందే. రేపు శనివారం కావడం మంచిదైయ్యింది. టికెట్ బుక్ చేసుకుని సోమవారం తెల్లారి కల్ల ఇండియాలో ఉంటాను."

"గుడ్. ఎప్పుడు తిరిగి రావటం?"

"వీలైనంత త్వరగానే ముగించడానికి ప్రయత్నిస్తాను. రిటర్న్ టికెట్ ఓపెన్ గానే కొంటున్నాను."

"గ్రేట్. అలానే నేను చెప్పిన అరసు విషయం కూడా మరచి పోవద్దు. వీలైతే కలవు."

(ముగింపు వచ్చే సంచికలో)

Post your comments